


సుందర చైతన్యాశ్రమం

హైదరాబాద్ - 500 043

నా కథే నా పాట



స్వామి సుందర చైతన్యానంద



నా కథే నా పాట



నా కథే నా పాట

నా కథే నా పాట
స్వామి సుందర చైతన్యానంద
(సర్వ స్వామ్యములు ట్రస్ట్‌వి)
ప్రతులకు :
సర్వజ్ఞ కల్చరల్ ట్రస్ట్,
సుందర చైతన్యాశ్రమం,
హైదరాబాద్ - 500 043.
☎: (08418) 255777
(08418) 255355
డి.టి.పి. & కవర్ డిజైనింగ్
సుందర చైతన్యాశ్రమం

స్వామి సుందర చైతన్యానంద

ఇందులో ....



నా కథే నా పాట

ముందు మాట

జీవితం నది లాంటిది. జీవితం లాగే నదికీ ఆది ఉంది. ఆది ఉన్న జీవ నదులకు తుది కూడా ఉంది. ఆద్యంతాల మధ్య సాగేదే నదీ ప్రవాహమైనా, జీవి ప్రయాణమైనా. పుట్టిన నది పారుతూ పారావారం చేరి శాంతిస్తుంది. పుట్టిన ప్రతి జీవి పయనిస్తూ, అనంతం వైపు సాగిపోతుంటాడు.

నది అందరికీ కనిపిస్తుంది. సాగే నదిలో ఎన్ని మలుపులో? ఎన్ని కలుపులో? ఎక్కడ అగాధమైన లోతు ఉందో, ఎక్కడ భయంకరమైన మకర సర్పాదు లున్నాయో, ఎక్కడ సుడిగుండా లున్నాయో ఎవరికి తెలుసు? నది కథ నదే చెప్పాలి. అంతే.

మరి, జీవికథ? అదీ అంతే. జీవితంలో ఎప్పుడు ఏది జరిగిందో, ఎక్కడ జరిగిందో, ఎలా జరిగిందో, ఎందుకు జరిగిందో ఆ జీవికే తెలుసు. ఇతరులకు ఎలా తెలుస్తుంది? ఒకవేళ తెలియాలి అంటే, ఆ జీవి నోరు విప్పాలి. లేదా కరములు కదిలించాలి. అప్పుడే స్వగతాలు బహిర్గతా లవుతాయి.

అయినా, ఎవరి జీవితం వారిదే. ఒకరి జీవితాన్ని మరొకరు తెలుసుకున్నంత మాత్రాన, తెలుసుకున్న వారికి ఒరిగే దేముంటుంది? ఏమో? కొందరి జీవితాలు కొందరిని ప్రభావితం చేయొచ్చు. మరి కొందరికి స్ఫూర్తి దాయకం కావచ్చు. అలా అవుతుంది అనుకున్నప్పుడు జనావళి కొందరి వ్యక్తుల ఆత్మకథల వైపు తదేకంగా చూస్తోంది. అది గమనించిన, గ్రహించిన వారు తమ జీవిత గాథను 'ఆత్మకథ'గా రచించి సమాజానికి అందిస్తారు. ఆత్మకథలన్నీ ఎక్కువ శాతం ఇలా వచ్చినవే.

ఇక విషయాని కొస్తే, నా 'ఆత్మకథ' వ్రాయమని చాలా కాలంగా ఎందరో ఎంద రెందరో అడుగుతున్నారు. అభ్యర్థిస్తున్నారు. ఏముంది వ్రాయటానికి? అయినా, ఎందుకనో ఆ విషయంలో నాకు ఆసక్తి ఇసుమంతైనా లేదు. నా ఆసక్తి, అనురక్తి, అభిరుచి 'ఆత్మ' విషయం లోనే గాని 'కథల' విషయంలో లేదు. అయినా, నాతో పాటు సంప్రదాయాన్ని ఊతగా గొని చరించే భక్తుల కోసం, జిజ్ఞాసువుల కోసం ప్రయత్నం అనివార్యమైంది. అదే ఇది.

కాకపోతే, నా ఆధ్యాత్మిక ప్రస్థానం ప్రారంభ మైనప్పటి నుండి, నేను రచించి గానం చేసే పాటలపై చాలా మందికి మక్కువ చాలా ఎక్కువగా ఉండేది. ఇప్పుడు మరీ ప్రబలింది.

వాస్తవానికి నా పాటలు జనావళిని విశేషం గానే ఆకర్షించాయి. ఆలోచింప చేశాయి. కారణం ఒక్కటే. నా పాట ఏదో కాదు; నా బాటే నా పాట. నా కథే నా పాట. ఒక విధంగా చెప్పాలంటే ప్రతి పాట వెనుక నా జీవితం ఉంది. పాట నేపథ్యమంతా నా అనుభవమే.

ఎవరి అనుభవాలు వారివే. అవి అంతర్గతాలు. ఆంతర్యాలు. అన్యులకు అంతు చిక్కేవి కావు. అందుకే నేమో, నా పాటలపై చాలా మంది, చాలా కాలంగా వ్యాసాలు వ్రాశారు. వ్రాస్తున్నారు. కాని, వాటితో నేను ఏకీభవించానా? లేదా? అనేది అప్రస్తుతం. కాని ఎవరి ఆంతర్యం వారిదే అనేది వాస్తవం.

ఆత్మకథల మీద ఆసక్తి లేని నేను, నన్ను ఆశ్రయించుకొని, నా బాటలో పయనించే ముముక్షువుల కోసం, వారి అభీష్టాన్ని తీర్చేందుకు సిద్ధపడ్డాను. అయితే ఆత్మకథను ఆవిష్కరించే ప్రయత్నంలో కలానికి స్వస్తి చెప్పి వాక్కుకు పని కల్పించాను. నా జీవితాన్నే పాటలలో పొదిగిన నేను, ఆ పాటలలో ఒదిగిన నా జీవన నేపథ్యాన్ని ప్రవచించాలని సంకల్పించాను. ఇదొక విలక్షణమైన ప్రయోగము.

నా జీవితంలో జరిగిన సన్నివేశాలు, నా జీవనంలో విస్ఫారిన అనుభవాలు నా పాటలలో నిక్షిప్తమై ఉన్నాయి. అవే నా మాటలలో వ్యక్త మవుతాయి. వాటికి సంబంధించిన పాటలూ గొంతు విప్పుతాయి. కాకపోతే, ఇవి వరుస క్రమంలో సాగవు. దశల ననుసరించి నడవవు. అందుకే ఇది ప్రయోగమని ముందే చెప్పాను. కనుక అది తప్పనిసరి. సన్నివేశాలు ఉంటాయే కాని అవి వరుసక్రమంలో ఉండవు.

ఈ ప్రయత్నంలో భాగంగా 'నా కథే నా పాట' అనే ఈ ఆడియో సి.డి. మొదటిది. ఇవి ఎన్ని వస్తాయో చెప్పలేను. ఎన్నయినా రావచ్చు. జీవించినంత కాలం కథ నడుస్తూనే ఉంటుంది. పాట వినపడుతూనే ఉంటుంది.

మొదటి సి.డి. కనుక, సరళమైన సరసమైన, సమరసమైన విషయాలకే ప్రాధాన్యత నిచ్చాను. కఠినమైన, కష్టతరమైన అనుభవాలను వ్యక్తం చేసే కార్యంలో తల దూర్చలేదు. రెండవ సి.డి.లో తప్పదు కదా? చూద్దాం. చూచేది అలా ఉంచి ప్రస్తుతానికి వినండి.

(1) ఊరేగే మేఘమాల

ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో, ఏ నాడు దాచుకున్న భాగ్యమో ఈ జన్మలో బాల్యం లోనే భక్తి మొగ్గ తొడిగింది. పది పదిహేను సంవత్సరాల మధ్య వయస్సులో భగవంతుని చూడాలని తీవ్రంగా పరితపించే వాణ్ణి. ఆ బాధలో ఆకలి వేస్తున్నా ఒక్కో పూట అన్నం తినేవాణ్ణి కాదు. ఆరోగ్యం సరిగ లేదని సాకు చెప్పి, దుప్పట్లో తల దూర్చి రోదించే వాణ్ణి. ఆ దశలో భగవంతుడంటే ఏమిటో కూడా తెలియదు. భగవద్గీత తెలియదు. జ్ఞానము అసలే లేదు. భగవంతుని కొరకు వ్యధ చెందడమే తెలుసు.

మా ఊరి సమీపంలో నది ప్రవహిస్తూ ఉంటుంది. దూరమైనా, అక్కడికి వెళ్ళి కూర్చొనేవాణ్ణి. చల్లని నదీ జలాన్ని పానం చేసి, పచ్చని మామిడి చెట్లను చూస్తూ, దూరంగా గోచరించే గిరి శిఖరాలను వీక్షిస్తూ, ఏకాంతంలో కొన్ని గంటలు ఉండిపోయే వాణ్ణి.

కృష్ణుడి కోసం ఆకాశం వైపు చూస్తే మేఘాలు కనుపించేవి. కృష్ణుడు నీలమేఘ శ్యాముడని హరికథలో విన్నాను. ఈ మేఘాలకి కృష్ణుని జాడ తెలిసే ఉంటుంది అనిపించింది. అవి కృష్ణుణ్ణి చూస్తున్నాయి అని భావించాను. వాటిని చూస్తూ విలపించాను. నన్ను కృష్ణుణ్ణి చూడ నివ్వండి అని ప్రార్థించాను. ఓ మేఘుమా! నువ్వు కొద్దిగా జరుగు, నేను కృష్ణుణ్ణి చూస్తాను అని ఏడ్చాను. మేఘం అలా తేలిపోతూ ఉంది. కాని, కృష్ణుణ్ణి తన వెనుకే పెట్టుకొని నాకు చూపకుండా తీసుకెళ్ళి పోతోందని అనిపించింది. చాలా బిగ్గరగా రోదించాను. కృష్ణుణ్ణి చూపమని పెద్దగా ఏడ్చాను. అదొక పిచ్చి గానే ఇప్పుడు అనిపించవచ్చు. కాని, ఆ వయస్సులో అదొక అనుభూతి. ఇప్పటికీ ఆ అనుభూతి నాలో పచ్చగానే ఉంది. వెచ్చగానే ఉంది. ఆ నాటి సన్నివేశాన్ని నాలో నేను స్మృతికి తెచ్చుకున్నప్పుడు ఈ పాట వ్రాశాను.

పల్లవి :

ఊరేగే మేఘమాల
విని పోవే నా మనసు గోల // ఊరేగే //

అనుపల్లవి :

నింగి కెగిరిన ఓ మేఘమాల
నేలను మరచెద వేల? // ఊరేగే //

చరణములు :

1. *దాగే గుణము అతని లీల*
దాచే మనసు నీకు ఏల?

గగనమే అతని గూడు
కలిసొచ్చెలే నీకు జోడు ॥ ఊరేగే ॥

2. మనసున్న నీలాల మేఘమా!
మాధవుని గననీవమ్మా!
కరుణించవే కబు రందించవే
కడతేర్చవే నన్ను మేఘమా! ॥ ఊరేగే ॥

(2) ఎంతని పిలిచేది నిన్ను

భగవంతు డంటే ఏమిటో సరియైన అవగాహన లేకపోవడం వల్ల నా మనసు లోని నిర్ణయాలు, ఆవేశాలు నా బ్రతుకును కుదిపేసేవి. దూరంగా ఉన్న వ్యక్తిని కేకేసి పిలిస్తే, అతడు మన దగ్గరకు వచ్చినట్లు, భగవంతుని భక్తితో పిలిస్తే, మనిషి లాగే దగ్గరికి వస్తాడని భావించటం చేత, అది జరగక పోయే టప్పటికి కుమిలి పోయేవాణ్ణి, తీవ్రంగా కలత చెందేవాణ్ణి. ఎందుకని భగవంతుడు నా దగ్గరికి రావడం లేదు? నాలో ఏదన్నా లోపముందేమో? లేక భగవంతుడు మనిషి లాగా దగ్గర లేడేమో! చాలా దూరం నుండి రావాలేమో అనుకునేవాణ్ణి.

మళ్ళీ అనిపించేది, ఎక్కడో అరణ్యంలో ఉండి గజేంద్రుడు పిలిస్తే శ్రీహరి తొందర తొందరగా వచ్చాడు కదా! మరి నేను పిలిస్తే ఎందుకు రావడం లేదు? అని విలపించే వాణ్ణి.

ఏది ఏమైనా, నేను భగవంతుడి కోసమే జీవించాలి. భక్తి తోనే బ్రతకాలి. భగవంతుడు వచ్చాడా, నేను తరించి పోతాను. ఒకవేళ రాకపోతే ఏమి చేయాలి? ఏముంది చేయడానికి? ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట చచ్చిపోతాను. కాని మళ్ళీ పుడుతామని అందరూ చెప్పుకుంటున్నారే! అప్పుడైనా భగవద్దర్శనం కాకుండా పోతుందా? అని ఊహించుకొని నన్ను నేను ఓదార్చుకొనే వాణ్ణి. బాధ మరీ ఎక్కువైతే, ఒంటరిగా కైవల్యా నదీ తీరంలో కూర్చుని బిగ్గర గానే రోదించేవాణ్ణి. ఆ రోజుల్ని తలుచుకుంటే, ఈ రోజు కూడా గగుర్పాటే. అలా ఏడుస్తూ భగవంతుణ్ణి వేడుకొనే వాణ్ణి. ఆ భావాలనే గుర్తుకు తెచ్చుకొంటూ ఈ పాట వ్రాశాను.

పల్లవి :

ఎంతని పిలిచేది నిన్ను
ఎందుకు ఈ దూరం?

అనుపల్లవి :

మాయ లెరుగని పిచ్చిమనసుకు
ఎందుకు ఈ భారం? ॥ ఎంతని ॥

చరణములు :

1. కలువకు చంద్రుడు నేలకు మేఘుడు దగ్గరున్నారా?
పంకజానికి తిమిర హరునికి దూరము నిలిచిందా?
దూరము లేని భారము తెలియని భక్తికి అడ్డుందా? ॥ ఎంతని ॥

2. ఏనాడైనా కాలం లోనే పోతారందరు
పోయేకాలం రాలే దేహం తెలిసిన వారెవరు?
కాలే దేహం కాటి కేగినా కాలదు మన బంధం ॥ ఎంతని ॥

(3) జో జో నందనందనా!

భక్తిలో ఎంత పిచ్చి ఉందో, అది పడితే గాని అర్థం కాదు. పెద్దగా ప్రయత్నం లేకుండానే బాల్యం లోనే నాలో మొగ్గ తొడిగిన భక్తి నన్ను ఏదో ఏదో చేసింది. రాత్రి పూట నిద్ర పట్టేది కాదు. మరీ చిన్నతనంలో మా నానమ్మ ప్రక్కన పడుకొని నిద్ర పోయేవాణ్ణి. ఆ తరువాత హైస్కూలులో చదువు. రాత్రిపూట చదువుకొని ఒంటరిగా పడుకొనేవాణ్ణి. భగవంతుణ్ణి గూర్చిన ఆలోచనలే మనస్సులో కదులుతూ ఉండేవి. నిద్ర పట్టేది కాదు.

నా దగ్గర దాచి పెట్టిన డబ్బులతో కొనుక్కున్న ఒక చిన్న కృష్ణుడి బొమ్మ ఉండేది. అది నాకు చాలా ప్రియమైన మూర్తి. ఒక విధంగా ఆ రోజుల్లో నా ప్రాణం అదే నేమో!

మా ఇంటికి సమీపంలో ఒక ముస్లిం టైలర్ ఉండేవాడు. అతడు కటింగ్ చేసే చోట చిన్న చిన్న వస్త్ర ఖండాలు క్రొత్తవి పడి ఉండేవి. నేను వాటిని ఏరుకొని, ఒక చిన్న పరుపుకు, చిన్న దిండుకు సరిపడేటంతగా ఆ గుడ్డల్ని ప్రోగు చేసుకొని, టైలర్ కిచ్చి ఒక చిన్ని పరుపు, చిన్ని దిండు కుట్టివ్వమని అర్థించాను. ఎందుకు అని అడిగాడు టైలర్. నా ప్రక్కన నా కృష్ణుడు పడుకుంటాడు. ఆయన కూడా నా లాగే చాప మీద పడుకుంటున్నాడు అని వెక్కి వెక్కి ఏడ్చాను. అతడు నన్ను ఓదార్చాడు. ఏవో కొన్ని ముస్లిం సూక్తులు, అవీ ఇవీ చెప్పి నన్ను ఊరడించాడు. 'నాయనా! నిన్ను భగవంతుడు చల్లగా చూస్తాడు' అని ఆశీర్వదించాడు. చిన్ని పరుపు, దిండు కుట్టి ఇచ్చాడు. బహుశ

పరుపు ఆరు అంగుళాలు, దిండు రెండు అంగుళాలు ఉండొచ్చు. అది తీసుకొని, ఆయన పాదాలకు నమస్కారం పెట్టి ఇంటికి వచ్చేశాను. ఆ రోజు వైకుంఠ ఏకాదశి. ఇతరులు ఒక ప్రక్క జాగరణ చేస్తున్నా, నేను కృష్ణుణ్ణి ప్రక్కన పండబెట్టుకొని ఆదమరచి నిద్రించిన వైకుంఠ రాత్రి.

చాలా కాలం అలాగే సాగింది. రాత్రి పూట కృష్ణుని మీద చేయి వేసుకొని ఏవేవో చెప్పుకోవడం నాకు అలవాటుగా మారింది. 'కృష్ణా! ఈ రోజు ఎవరెవరిని రక్షించావు? ఎక్కడెక్కడ తిరిగావు? అలసిపోయావా? కాళ్ళు నొచ్చుతున్నాయా? నేను మెల్లగా సేవ చేయనా?' అంటూ కృష్ణుని పాదాలను ఒత్తుతూ, అలాగే నిద్రపోయేవాణ్ణి. ఆ స్మృతులు నాలో ఇప్పటికీ పచ్చగానే ఉన్నాయి. వాటిని తలచుకొంటూ వ్రాసిందే ఈ పాట.

పల్లవి :

జో జో . . . నందనందనా !
జో జో . . . సుందర వదనా! . . . జో. . . జో. . .

అనుపల్లవి :

చిలిపి చేతల చందురుడా
ముసి ముసి నవ్వుల వాడా! . . . జో . . . జో . . .

చరణములు :

1. అలసితి వేమో ఇల పాలించి
సొలసితి వేమో భక్తుల గాచి
ఆశ్రితుల బరువులు మోసి
అవనికి భారము దించి
బడలిక చెందితి వేమో! ॥ జో ॥

4. ఎక్కడెక్కడ తిరిగితివో
పాదము లెంతగ నొచ్చినవో
చల్లని పదముల మెల్లగ నొత్తుచు
నేనూ వాలెద స్వామి
నిదురింతుము ఇక స్వామి ॥ జో ॥

(4) బ్రతుకు బొమ్మలాట

అప్పుడు నాకు పదహారు సంవత్సరాలు. ఎస్.ఎస్.ఎల్.సి. చదువుతున్నాను. మా తండ్రి మరణించాడు. మా అన్నగారికి ఇరవై ఆరు సంవత్సరాలు. ఆయన జీతమే ఇక అందరికీ ఊపిరైంది. మా తమ్ముడికి ఆరు సంవత్సరాలు. ఇంకా అతణ్ణి బడికి పంపలేదు. అకస్మాత్తుగా జరిగిన ఆ సంఘటన పసి హృదయాలపై పిడుగు పడినంత పని చేసింది.

తండ్రి పార్థివ దేహం కాలుతూ ఉంటే సమీపంలో ఉండి చూశాను. కళ్ళ ముందే బూడిదగా మారిన తండ్రి శవం నా మనస్సుపై చెదరని ముద్రను వేసింది. ఏనాడైనా, ఎవరి శవమైనా శ్మశానంలో పిడికెడు బూడిదగా మారుతుందనే నగ్న సత్యాన్ని కనీసం వల్లకాటిలో నైనా గుర్తిస్తారేమో అనే భావన తోనే హిందూ సంప్రదాయంలో తండ్రి శవానికి కొడుకు చేత నిప్పు పెట్టిస్తారని ఈ రోజు వేదికలపై నేను పలికే వాక్యానికి నాంది ఆ సన్నివేశమే.

ఆ తరువాత ఇరవై సంవత్సరాలు దొర్లిపోయాయి. నాకు ముప్పై ఆరు సంవత్సరాలు. మా తల్లి గతించింది. తండ్రిని దహనం చేసినట్లు తల్లిని దహనం చేయలేదు. మా వంశ సంప్రదాయానికి భిన్నంగా ఆమె పార్థివ దేహాన్ని పూడ్చి పెట్టడం జరిగింది.

కారణం ఏదో కాదు. అప్పట్లో మా ఊరిలో రామలింగ స్వామి ఆలయంలో నేను ఉపన్యాసాలు చెబుతూ ఉంటే, వినే శ్రోతలలో ఆమె కూడా ఒకతె. ఆలయానికి సమీపంలో, దారి ప్రక్కన ఆమె అంత్యక్రియలు జరగటం చేత, అలా చేయవలసి వచ్చింది.

ఎవరి చేతుల్లో నేను ప్రేమగా పెరిగానో, ఆమె దేహంపై నేను మట్టి వేసినపుడు తీవ్రంగా చలించి పోయాను. నదీస్నానం చేసి ఆలయంలో దర్శనం చేసుకొని తిరిగి వస్తూ ఉంటే, నా మనస్సులో కొన్ని భావాలు వేగాన్ని పుంజుకున్నాయి.

ఇదే సత్యం. ఎవరి జీవితమైనా ఇంతే. తెచ్చుకున్నది మట్టే. తిరిగి ఇచ్చుకొనేదీ మట్టే. ఇక మన ప్రయాణం మారాలి; అని నిశ్చయించుకున్నాను. అంతే. ఆరు నెలలు తిరుగక ముందే మద్రాసు వెళ్ళి శ్రీశ్రీశ్రీ శుద్ధానంద భారతీ స్వాముల వారిని కలిసి వారి ఆశీస్సులు తీసుకొని ఇల్లు వదిలిపెట్టి ఒంటరిగా ధవళేశ్వరం చేరి ఆశ్రమాన్ని ప్రారంభించాను.

పూజ్యులు శ్రీ శుద్ధానంద భారతీ స్వాముల వారు నూట నాలుగు సంవత్సరాల వయస్సులో స్వయంగా వచ్చి స్వహస్తాలతో ఆశ్రమాన్ని ప్రారంభించి ఆశీర్వదించారు.

'Sudha and Sundara shall be one in Krishna Consciousness' అని ఆ సందర్భం లోనే వేలాది శ్రోతల కరతాళ ధ్వనుల మధ్య ప్రకటించారు.

తండ్రి గారి కంటే తల్లి మీదనే నాకు ప్రేమ ఎక్కువగా ఉండేది. ఆమెపై మట్టి వేసిన ఆ తుది సన్నివేశం స్మృతిలో మెదిలినపుడు వ్రాసిందే ఈ పాట.

పల్లవి :

బ్రతుకు బొమ్మలాట – విను నా మాట
విధి నడిపే వింతలే – ఇలలో ఆట   ॥ బ్రతుకు ॥

అనుపల్లవి :

ఇంతేనా – జీవిత మింతేనా?
చింతేనా – జీవికి చింతేనా?   ॥ బ్రతుకు ॥

చరణములు :

1. దేవు డిచ్చింది మట్టి ఒక్కటేలే
కట్టు కున్నప్పుడే మేడ ఔతుందిలే
ఏదో ఓనాడు కూలిపోతుందిలే
చివరికి తన వారు వేసేది మట్టేలే   ॥ బ్రతుకు ॥

2. రాలేవి ఆకులు కూలేవి మాకులు
అన్నీ గారడీలు మిగిలేవి గాయాలు
గమనాన్ని మార్చుకో–గమ్యాన్ని చేరుకో
నీలో నీవు నిండుగా ఉండిపో!   ॥ బ్రతుకు ॥

(5) గాలికి లోటున్నదా?

సన్యసించాలనే తీవ్ర వైరాగ్యం గల వారికి కూడా సన్యసించే సమయంలో తెలుస్తుంది సన్యసించడ మనేది అంత తేలికైన కార్యం కాదని. ఆ విషయంలో నేను విలక్షణంగా లేను.

ముప్పై ఆరు సంవత్సరాలు ఉమ్మడి కుటుంబంలో కుటుంబం లేని సభ్యుణ్ణిగా కొనసాగాను. క్షణంలో ఏకాకి నయ్యాను. ఆ క్షణంలో ఏదో అనిపించింది. కొన్ని నిమిషాలు అభద్రతా భావం చోటు చేసుకుంది. జ్వర మొస్తే, మందెవరిస్తారు? ఆహారం లభించక పోతే ఆకలిని భరించే దెలా? బట్టలు ఎవ్వరు ఇవ్వకుంటే తుండుగుడ్డ

చుట్టుకొని తిరగ గలనా? ఇలాంటి ప్రశ్నలు నా మనస్సును ముసురు కున్నది మాత్రం వాస్తవం. అంతా కొన్ని నిముషాలే.

విశ్వనాథ స్వామి ఆలయంలో నిలబడలేక కూర్చుండి పోయాను. బుద్ధి మొద్దుబారి నట్లైంది. ఈ అనుభవము కూడా నా జీవితంలో ఉంది.

అలా చూస్తూ ఉండగానే ధ్వజ స్తంభము దగ్గర నుండి ఒక కాకి పైకి ఎగిరింది. నాకు కబురందించేందుకే ఎగిరిందేమో అని ఇప్పు డనిపిస్తుంది.

ఈ పక్షికి ఎవరున్నారు? దీని దేవూరు? ఇదెవరికి సంబంధించింది? దీనికి జ్వర మొస్తే? ఆకలై ఆహారం లభించకపోతే? ఇలా ప్రశ్నలపై ప్రశ్నలు ఉరికురికి పడ్డాయి. నా ప్రశ్నలకు సమాధానం లభించినట్లైంది. పక్షికి లేని అభద్రత నాకెందు కొచ్చింది? తన రెక్కల్ని నమ్ముకొని పక్షి అంత ఆనందంగా విహరించే టప్పుడు, భగవంతుణ్ణి నమ్ముకున్న నేను ఆనందంగా సంచరించలేనా? అని ప్రశ్నించుకోగానే కూలబడ్డ నేను లేచి నిలబడ్డాను. అంతే, ఆనాటి నుండి నేటి వరకు అలాంటి అభద్రత మళ్ళీ నా జీవితంలో తలెత్త లేదు. పక్షి ఎగిరిన సన్నివేశాన్ని గుర్తు చేసుకొని వ్రాసిందే ఈ పాట.

పల్లవి :

గాలికి లోటున్నదా?
ఏటికి పోటున్నదా?
మంచిని తెలిసి
సమతను పిలిచే
మనిషికి కొర తున్నదా?   ॥ గాలికి ॥

చరణము :

పక్షికి ఊరున్నదా?
అక్షికి నోరున్నదా?
మచ్చిక తెలిసి మనుగడ నడిపే
కుక్షికి కరువున్నదా?   ॥ గాలికి ॥

(6) పూజా ఫలము నీకే ఉండనీ

ఇక్కడే సంపూర్ణ శరణాగతి జరిగింది. పొందితే మోక్షాన్ని పొందుతాను. లేకపోతే, చెట్టు నుండి పండుటాకు రాలినట్లు రాలి పోతాను అని నిశ్చయించు కున్నాను.

పరమాత్మనే ఆశిస్తాను గాని పరమాత్మ నుండి దేనిని ఆశించను. ధ్యానమే

నాది. ధ్యానఫలము దేవునిదే అనుకునే వాణ్ణి. నా కళ్ళకు కృష్ణుడే కనిపించాలి. కృష్ణుడే నా కనుపాపగా మిగిలి పోవాలి అని పరితపించే వాణ్ణి. మనస్సులో మాధవుడు మరుగైతే, నీటిని వీడిన చేప లాగా చలించి పోయేవాణ్ణి. ఆ దశలో అనుభవించిన, ఆలపించిన భావాలనే ఈ పాటలో రచించాను.

పల్లవి :

పూజా ఫలము నీకే ఉండనీ
పూజే ఫలముగ నాకు మిగలనీ

అనుపల్లవి :

సలిలము నిండిన నా నయనాలలో
కదలక నీ రూపు నిలిచిపోనీ // పూజా //

చరణములు :

1. అందీ అందని అందము నీవు
అందుకోలేని ఆశను నేను
రెప్పలు కదలక చూచే కనులలో
నిండి పొరలే కన్నీటిని నేను // పూజా //

2. నీ అడుగుల కడ పువ్వును నేను
నీ కృపతో విరిసే నవ్వును నేను
ఎవరిని కోరని యెదను నేను
నీకు దూరమై బ్రతకలేను // పూజా //

(7) వృథా చేయబోకు

ఎలాగో సన్యసించేశాను. ప్రపంచంతో నాకున్న భౌతిక సంబంధాలన్నీ పటాపంచ లయ్యాయి. నేను ఒంటరి నయ్యాను. ఏది ఏమైనా జన్మను సార్థకం చేసుకోవాలని దృఢంగా నిశ్చయించుకున్నాను. నా కంటూ విలక్షణమైన మార్గాన్ని నిశ్చయించుకున్నాను. మనసును ఆ వైపే నిలిపాను.

మా నాన్నగారికి ఒకే ఒక తమ్ముడు ఉండేవాడు. చాలా మంచివాడు. నేను చదువుకునే దశలో నాకు ఎంత గానో సహాయం చేసేవాడు. ఆయన ఒక రోజు ఊహించని విధంగా ధవళేశ్వరం ఆశ్రమానికి వచ్చాడు. నేను ఆశ్చర్య పోయాను.

ఒంటరిగా చెట్టు క్రింద కుర్చీలో కూర్చుని ఉన్న నా దగ్గరికి వచ్చి, నాకు నమస్కరించి, అక్కడ పరచి ఉన్న చాపపై కూర్చున్నాడు.

మంచినీళ్ళు త్రాగుతారా? మజ్జిగ తీసుకుంటారా? అని అడిగాను. వద్దన్నట్లు తల ఊపాడు.

చూడండి. నేను సన్యాసిని. అన్ని బంధాలు త్రెంచుకున్నవాణ్ణి. 'నా' అనే వాళ్ళెవ్వరూ ఇంతవరకు నా వద్దకు రాలేదు. ఈ రోజు మీరు వచ్చారు. నాకు ఆశ్చర్యంగా ఉంది అన్నాను.

స్వామీ! నేను ఏ బంధాన్నో అంటిపెట్టుకొని రాలేదు. మిమ్మల్ని చూడాలి అనిపించింది. చూచి పోదామని వచ్చాను. మీరు అవకాశం ఇస్తే రెండే రోజులు ఆశ్రమంలో విశ్రమించి వెళ్తాను. కాదంటే, ఈ క్షణమే వెను దిరుగుతాను' అన్నాడు తల వంచుకొని.

రెండు నిముషాలు మా మధ్య నిశ్శబ్దం. 'సరే రెండు రోజులు ఉండి వెళ్ళండి' అన్నాను. రెండు రోజులు కాగానే ఆయన నా వద్దకు వచ్చి నిలబడి, నమస్కరించాడు. అప్పుడు కూడా నేను ఒంటరి గానే కూర్చుని ఏదో వ్రాసుకుంటున్నాను.

'స్వామీ! నేను వస్తాను. మీ కన్నా వయస్సులో ఎంతో పెద్దవాణ్ణి. మీ శ్రేయోభిలాషిని. నాది సలహా కాదు; విన్నపం. మీరు సన్యాసాన్ని విడిచిపెట్ట నవసరం లేదు. అలాగే వచ్చి మా మధ్య లోనే ఉంటూ మీ సాధన మీరు చేసుకుంటూ జీవించవచ్చు కదా! ఆలోచించండి' అని పలికి కన్నీళ్ళు తుడుచుకొంటూ వెళ్ళిపోయాడు. ఆ తరువాత ఆయన మరణించే వరకు నా వద్దకు రాలేదు. పెద్దవాడు. మంచివాడు. ఆయన వెళ్ళిన తరువాత నేను నా మనస్సుతో మాట్లాడాను.

'మనసా! అరుదైన మానవ జన్మము లభించింది. మనం దానిని సద్వినియోగం చేసుకోవాలి. సంసార బంధాలన్నీ అనిత్యాలు. మృత్యురూపాలు. ఏదో నాటకం నడిచి పోతోంది. పెద్ద చిన్న ఏముంది? ప్రతి జన్మలో పెద్ద లున్నారు. వాళ్ళ మధ్యే పెరిగినా, పెద్ద వాళ్ళం కాలేకపోయాం. నిజమైన పెద్దలు మన పూర్వీకులైన ఋషులే. వారి మార్గమే మన మార్గం అని మనస్సుతో మాట్లాడాను. ఆ సన్నివేశాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆ నాటి భావనలను పాటలో పొదిగాను. అదే ఇది.

పల్లవి :

వృథా చేయబోకు – జన్మము
సదా రాదు నీకు – ఈ జన్మము
సదా రాదు నీకు // వృథా //

చరణములు :

1. ఉత్తమ జన్మమురా – దీనిని
వ్యర్థము చేయకురా
ఉత్త సంసారమురా – రేపది
మృత్యురూప మౌరా ॥ వృథా ॥

2. అంతా నటనేరా – ఈ లోకము
నరకము చూపునురా!
పెద్దల మార్గములో నడచి
సిద్ధిని పొందుమురా ॥ వృథా ॥

(8) సంసారమె సంగ్రామము

అది జరిగిన తరువాత కొంత కాలానికి ఒక రోజు నెల్లూరు నుండి ధవళేశ్వరానికి ఫోన్ వచ్చింది. మీకు పత్రికలు సమర్పించాం. ప్రత్యేకంగా ఆహ్వానించాం. ఇంతవరకు మీ కోసం ఎదురు చూశాం. మాకు నిరాశే ఎదురైంది. మీరు రానిదే మీ తమ్ముడు గారు పెళ్ళి పీటల మీదకి రానంటున్నాడు. 'మాకు ఆయనే దైవం. మా దైవం ఎదుటే మా పెళ్ళి జరగాలి. లేదా నేను జీవిత మంతా బ్రహ్మచారి గానే ఉండిపోతాను అంటున్నాడు. దయచేసి వెంటనే మీరు కారులో బయలుదేరాలి అని చాలా మంది ఫోన్లు చేశారు.

అయినా, నేను వెళ్ళలేదు. పెళ్ళి జరిగి పోయింది. ఇప్పుడు ఆయన గారు తాత కూడా. కానీ, ఈ రోజుకి నన్ను వాళ్ళందరూ దేవుడు గానే చూసుకుంటారు. అది వారి సంస్కారం. తల్లి రంగనాయకమ్మ సౌజన్యం.

పెళ్ళి జరిగిన తరువాత నేను నా మనస్సుతో చెప్పాను. మనసా! నేను చేసింది తప్పని నా కనిపించడం లేదు. అలాగని నేను నా మనస్సులో ఆ బిడ్డను ఆశీర్వదించక పోలేదు. మమకారాలు మృత్యుపాశాలు. పెంచుకుంటే ఎంత వరకైనా పోతాయి. ఆ తరువాత మిగిలే దంతా చీకటే. రాలేదని అందరూ బాధపడి ఉండొచ్చు. కాని, పోలేదనే బాధ నాకు లేదు అని చెప్పాను. ఆనాటి నా భావనలే ఈ పాటలో వ్యక్త మవుతాయి.

పల్లవి :

సంసారమె సంగ్రామము
తెగిన ప్రేగు అనుబంధము

జీవుల ఆరాటము
జీవన పోరాటము ॥ సంసారమె ॥

చరణములు :

1. సమర నదిలో మమకార జలము
ఎవరినైనా ముంచుట సత్యము
ఎంత ఈదినా తెలియదు తీరము
ముందు వెనుక గాఢాంధకారము ॥ సంసారమె ॥

2. ఆశల అలలు నిరాశల నీడలు
కనుల ముందే కరుగును కలలు
ప్రియములు, ప్రేమలు మంచుకొండలు
చుట్టరికాలు ఎండమావులు ॥ సంసారమె ॥

(9) నీవే - నీవే - నీవే - నీవే

గీతా యజ్ఞాలు సాగుతున్నాయి. అప్పటికే యాభై యజ్ఞాలు పైగా పూర్తయ్యాయి. యజ్ఞ సమయంలో భక్తులు విశేషంగా హాజరయ్యేవారు. మధ్యమధ్యలో దర్శనాని కని నేను విడిది చేస్తున్న ప్రదేశానికి వచ్చేవారు. అందరి తోనూ కలుపుగోలుగా ఉంటూ, నోరార మాట్లాడేవాణ్ణి. నా బోధల కన్నా నా ప్రవర్తనకే ఎక్కువగా జనం ఆకర్షింప బడేవారు.

'స్వామీ! మీ వాగ్ధాటి అసమానం. మీ ప్రవచనాలు వింటుంటే, వివేకానంద స్వామిని చూడలేక పోయామనే కొరత లేకుండా పోయింది. మీ ఋణం తీర్చుకోలేమని కొందరు,

'స్వామీ! మీ బోధల వల్ల మా జీవితాలు మారిపోయాయి. ఎన్నడూ లేనంతగా మాలో భక్తి భావాలు పొడసూపాయి; అని మరి కొందరు, స్వామీ! అంతరించి పోతుందేమో అనుకుంటున్న దశలో, హిందూ ధర్మానికి మీరు ఊపిరి పోశారు. పోస్తున్నారు. మీకు హిందూ జాతి ఋణపడి ఉంటుంది అని కొందరు ఇలా పొగిడేవారు.

అందరూ వెళ్ళిపోయిన తరువాత, నేను నా ఆరాధ్య దైవంతో మాట్లాడేవాణ్ణి. భగవాన్! ఎవరెవరో ఏదో ఏదో పొగిడేస్తున్నారు. అది నాకు తప్పు గాను కనిపించడం లేదు. అనాలోచిత మని అనిపించడం లేదు. అది వైభవమే అనే విషయంలో విభేదము లేదు. కాకపోతే, ఎవరి వైభవము? అనే విషయం లోనే ఉంది చిక్కంతా.

'నేను పలికేది, పాడేది నీ వైభవమే కనుక వైభవంలో తేడా ఏమీ లేదు. నీ వైభవాన్ని నా వైభవంగా చూసి మాట్లాడుతున్నారే అదే తికమకగా ఉంది. ప్రభూ! ఎవరు ఎలా పొగిడినా, నా మనస్సు చైతన్య లాడకుండా నువ్వు నన్ను ఆశీర్వదిస్తే చాలు. నా నుండి ఏ వైభవము వ్యక్తమైనా అది నీ వైభవమే నని నాకు క్షుణ్ణంగా తెలుసు. ఈ జ్ఞానమును ఇలాగే ఉండనీ అని ప్రార్థించే వాణ్ణి. ఆ నాటి ప్రార్థనలే నేడు ఈ పాటలో ప్రతిధ్వనిస్తున్నాయి.

పల్లవి :

నీవే - నీవే - నీవే - నీవే - నీవే
నా యెద కదిపిన కళ నీవే ॥ నీవే ॥

చరణములు :

1. *నా పలుకులలో కులుకువు నీవే*
నాలో తియ్యని పలుకువు నీవే
హృదిలో తీరని వలపువు నీవే
మదిలో ఆగని పిలుపువు నీవె ॥ నీవే ॥

2. *కవితల గుండెలో ప్రాణము నీవే*
మమతల గుడిలో వాణివి నీవే
మనసున్న మనిషి నిదానము నీవే
మహిమను తెలిపే విధానము నీవే ॥ నీవే ॥

(10) నల్లని వాడు - అల్లరి వాడు

కృష్ణుడు ఇష్ట దైవం కావడానికి నా బాల్యంలో నా కంటూ కొన్ని ప్రత్యేక భావాలు ఉండేవి. కృష్ణుడు ప్రేమమయుడు. ఆయనకు అందరూ సమానమే. పెద్దల్ని ప్రేమిస్తాడు. పిన్నలను ప్రేమిస్తాడు. పండితులను ప్రేమిస్తాడు. పామరులను ప్రేమిస్తాడు. గోవులను ప్రేమిస్తాడు. దూడలను ప్రేమిస్తాడు. ఏ ఆయుధాన్ని ధరించడు. కేవలం పిల్లనగ్రోవిని మాత్రమే చేత పట్టుకొని ఉంటాడు. చక్కగా మురళీనాదం చేస్తూ ఉంటాడు. ఏ చదువులు లేకపోయినా, గోపభామలను వెంబడించి ఉండేవాడు. వాళ్ళు పాడమంటే పాడేవాడు. ఆడమంటే ఆడేవాడు. అందుకనే, నాకు కృష్ణు డంటే చెప్పలేనంత భక్తి ఏర్పడింది. సదా నా హృదయంలో కృష్ణుడే ఉన్నాడని భావించి తన్మయుణ్ణయ్యే వాణ్ణి. ఆ భావాలనే పొదిగాను 'నల్లనివాడు' అనే పాటలో.

పల్లవి :

నల్లని వాడు అల్లరివాడు
చైతన్యుని యెదలో మాధవుడు ॥ నల్లని ॥

చరణములు :

1. *వనమున పెరిగిన వెదురు కూనను*
ముద్దుల మురళిగ మార్చాడు
మోహన వంశిని పలికించి
జగతిని మురిపించాడు
బృందావనిలో మురళీనాదం
భక్తుల పాలిటి అమృతగానం ॥ నల్లని ॥

2. *చల్లను అమ్మే చెలువల వెంట*
అల్లరి చేయుచు తిరిగాడు
నీవే దిక్కని నమ్మిన వారికి
గతియై పతియై నిలిచాడు
దీనులకు అతి దీనులకు
హీనులకు బలహీనులకు
గతిహీనులకు ఆలంబనము ॥ నల్లని ॥

(11) మానస వీణ మ్రోగేనా ?

అక్కడి నుండి రచనలు వేగాన్ని పుంజుకున్నాయి. అనేక పుస్తకాలు దొర్లుతూ వచ్చి జనావళి లోకి దూసుకు పోతున్నాయి. పుస్తకాలపై జనావళిలో ఆదరణ పెరిగింది. మరో వైపు పాటల క్యాసెట్లు కూడా రాసాగాయి. ఇటు పాటలు వ్రాసి పాడుతూ, అటు గ్రంథాలు రచించి ప్రచురిస్తూ దివారాత్రాలు ఒకేలా గడిపేవాణ్ణి.

వ్రాసినా, పాడినా, చెప్పినా, చేసినా అంతా వాసుదేవుని అనుగ్రహమే అని భావించే వాణ్ణి. నా నుండి ఏ సేవ సమాజానికి అందినా, అదంతా పరమేశ్వరుని అనుగ్రహమే నని తృప్తి చెందేవాణ్ణి. మున్ముందు కూడా ఇలాగే సాగాలని పరవశించి ప్రార్థించేవాణ్ణి. ఆ నాటి భావాలే ఈ పాటలో వ్యక్త మవుతాయి.

పల్లవి :

మానస వీణ మ్రోగేనా?
అనురాగ లత పూచేనా!

అనుపల్లవి :

వీణ లోని శ్రుతి పిలిచి
పువ్వు లోని తావి వలచి ॥ మానస ॥

చరణములు :

1. పడింది తాళం మ్రోగింది మేళం మధురముగా
నవ్వులు రువ్వుతూ కదిలింది పదం మంజులంగా
శ్రుతిలయలు జత చేరి కృష్ణుని కీర్తించగా ॥ మానస ॥

2. రాసింది పాడింది చెప్పింది చేసింది నీ కృపావరం
నా నుండి జరిగింది ఏదైనా నీ దయాగుణం
శేషించిన దేదున్నా శేషశాయి నీడనే ॥ మానస ॥

(12) హైలెస్సా

జనం సరే, ఎవరికి తోచినట్లు వాళ్ళు పొగడ సాగారు. బోధనా విషయంలో నాలో కూడా స్థిరత్వం ఏర్పడింది. మంచి వయస్సులో ఉన్నాను. పూర్ణ ఆరోగ్యంతో ఉన్నాను. ఇంకేముంది? ఇలాగే యజ్ఞాలు నిర్వహిస్తూ పరిశ్రమిస్తే, భగవత్కృప వల్ల సత్య మతానికి ఎంతో సేవ చేయొచ్చు అని ఉవ్విళ్ళూరాను. గొంతు పెంచాను. వేగాన్ని పుంజుకొని ప్రవచింప సాగాను.

ఇంకేముంది సమాజాన్ని ఎలాగూ ఊపేస్తూ ఉన్నాం. ఇక సమాజాన్ని మార్చేయగలం అని భావించాను. అప్పట్లో నా భావాలు ఇలా ఉండేవి.

పల్లవి :

హైలెస్సా.......... హైలెస్సా
వేదము నేనని తెలుసా!

అనుపల్లవి :

ఎన్నో ఎన్నో చెప్పి ఊరిస్తా
మరుక్షణమే బ్రతుకంతా మారుస్తా ॥ హైలెస్సా ॥

చరణములు :

1. సంసార తిమిరాలు చీలుస్తా
అజ్ఞాన జలములు పీలుస్తా
రాగద్వేషాలు రాల్చేస్తా
శాంతి ప్రేమలు నింపేస్తా ॥ హైలెస్సా ॥

2. భ్రమలు లేవని నిరూపిస్తా
బ్రహ్మమే ఉందని వినిపిస్తా
ఉన్నది చైతన్యం అనిపిస్తా
ప్రమాణమై నీకు కనిపిస్తా ॥ హైలెస్సా ॥

(13) మారిన దెవరు? మార్చే దెవరు?

నా భావన సరియైనది కాదని, నేను దారి తప్పి ఆలోచిస్తున్నా నని తెలుసుకోవడానికి ఎంతో కాలం పట్టలేదు. మనుషుల్ని మార్చడం అనేది అనుకున్నంత తేలికైన పని కాదని గ్రహించాను.

జనాన్ని నేను మార్చడం అనే మాటను అటుంచి, జనం నన్ను మార్చకుండా జాగ్రత్త పడాలి అనే నిర్ణయాని కొచ్చాను. ఏదో మేలు చేద్దామని పాల సముద్రం వద్దకు వెళ్ళిన పరమశివుడికి విషపానం తప్పలేదు. రాయబారం నడిపి కౌరవ పాండవుల్ని ఏకం చేద్దామని, దుర్యోధనుడిలో తన బోధల ద్వారా మార్పును తెద్దామని ప్రయత్నించిన భగవంతుడికే మార్పు తీసుకు రావడం సాధ్యం కాలేదు. పైగా దుర్యోధనుడు సృష్టించిన ప్రమాదం నుండి నేర్పుగా బయట పడాల్సి వచ్చింది.

ఇక నేను ఏపాటి వాణ్ణి. ఈ భావన స్థిరపడగానే మన బోధల వల్ల మారేవాళ్ళు మారితే, సంతోషము. మారలేని వాళ్ళు మారలేకపోతే అదీ సంతోషమే. ఎందుకంటే, ఈ రెండిటి వెనుక నేపథ్యం నియతియే నని, ధర్మమే నని గ్రహించాను. ఆ క్షణం నుండి ఈ మార్పులు, చేర్పులు, కూర్పులు అనే పదాలను పూర్తిగా మరచి పోయాను. ఆ సందర్భాలను స్మృతికి తెచ్చుకున్నప్పుడు వచ్చిందే ఈ పాట.

పల్లవి :

మారిన దెవరు - మార్చే దెవరు?
మార్పు మనిషికి సాధ్యమా మనసా? ॥ మారిన ॥

అనుపల్లవి :

కురిసే మబ్బును నిలిపే దెవరు?
మారే మనసును ఆపే దెవరు? // మారిన //

చరణములు :

1. *రమ్మని గాలిని పిలిచిం దెవరు?*
పొమ్మని ప్రాణము తెలిపిం దెవరు?
గాలితో కదిలిన కోమల కాయము
కాటికి పొమ్మని చెప్పిం దెవరు? // మారిన //

2. *పాలకడలిలో కాలకూట విషము*
ఎదురౌ తుందని ఎరిగిన దెవరు?
ఏ పాప మెరుగని కైలాసపతికి
గళమున గరళము నింపిం దెవరు? // మారిన //

3. *నీకు లేనిది నీది కానిది*
ఇవ్వలేరు ఇలలో దేవతలైనా
కర్కశమైన కౌరవపతిలో
మార్పును చూశాడా కేశవుడైనా // మారిన //

(14) దోషము చూడకు

నే నైతే కళ్ళు తెరుచుకున్నాను. కానీ, అప్పటికే జరగ వలసిందంతా జరిగి పోయింది. నా నుండి ఏవేవో ఆశించి పొందలేని వాళ్ళు అసత్య ప్రచారాలకు శ్రీకారం చుట్టారు. లౌకికంగా నా అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని కొందరు నన్ను, కొందరు నన్ను ఆశ్రయించుకున్న భక్తులను మోసం చేశారు. లోకం పోకడను చూచి దిగ్భ్రాంతి చెందాను. నేను కలత పడలేదు అని చెప్పడానికి సాహసించను. కాని, ఇతరులను నిందించే ప్రయత్నం కన్నా నియతిని అర్థం చేసుకొనే పనిలో తల మునక లయ్యాను. కారణం లేనిదే కార్యము జరుగదు. నన్ను మోసగించడం మోసగించిన వాళ్ళ పురుషార్థము అనే ఆలోచనకు స్వస్తి చెప్పి, నా ప్రారబ్ధమే కారణము అని పైకి చెప్పక పోయినా, లోలోన భగవంతునితో చెప్పుకొనే వాణ్ణి. భగవాన్! నన్ను క్షమించు. ఏ దోషం చేశానో, నేడు పరులచే హింసింప బడుతున్నాను. నీకు అన్నీ తెలుసు. ముఖ్యంగా నే నెలాంటి వాణ్ణో నా మన సెలాంటిదో నీకే తెలుసు; అని విన్నవించుకొనే వాణ్ణి. ఆ నాటి ఆవేదనలే ఈ పాటలో ప్రతిఫలిస్తాయి.

పల్లవి :

దోషము చూడకు – కరివరదా!
నా మనసు నీకు తెలియనిదా! // దోషము //

చరణములు :

1. *కోరితినా కోర్కెలు తీర్చమని*
పిలిచితినా పసిడి ఇవ్వమని
ఉలకవు పలుకవు కారణ మేమి?
నీదేముంది? నా తలరాతే గాని // దోషము //

2. *కల్లలు తెలియక ఉల్లము చెదరి*
కుంచుకపోతి వంచింపబడి
యెద బాధను ఎరుగలేవా?
కనికరించి కడతేర్చగ రావా? // దోషము //

3. *పాపము చూడకు నీ పాపను నేను*
కోపము బూనకు కొరగాను
లోపములే నా లోపల నున్నవి
చూపుము కరుణ కమనీయ వదనా! // దోషము //

(15) ఎన్ని విభూతులు

అలా పరమేశ్వరునికి నా మొర వినిపించ గానే నా మనస్సు తేలిక పడేది. ఊరట చెందేది. అదంతా భగవంతుని కరుణే అనేది ఈ నాటికీ నా ప్రగాఢ విశ్వాసము.

మానవ సమాజం విచిత్ర మైనది. విధి చేతిలో కీలుబొమ్మ. ఈ సమాజంలో ఎవరి మనసులు ఎలా ఆలోచిస్తాయో, ఎవరి ప్రవర్తన ఎలా మారుతుందో ఊహించ లేము. దానికి తోడు వ్యక్తి అమాయకత్వము కూడా తోడైతే, ఇక చెప్పే దేముంది? అంతా అల్లకల్లోలమే.

నా విషయంలో ఒకప్పుడు అలాగే జరిగింది. మనుషులు పెట్టే బాధల్ని భరించ లేక నా మనస్సు కుంచుకు పోయేది. అలాంటి సందర్భాలలో ఏవేవో అనాలోచితమైన సలహాలను నా ముందు పెట్టేది నా మనస్సు. నన్ను ఓదార్చే వాళ్ళు లేకపోయినా, నా మనస్సును నేను ఓదార్చేవాణ్ణి.

పిచ్చిదానా! సమాజానికి సేవ లందించాలని మనము ఉబలాట పడ్డాము. బాగ లేని సమాజము బాధ పెట్టడంలో ఆశ్చర్య మేముంది? బాధ పెట్టిందని జడిసి పోతే, మనం ఈ రంగం లోకి ఎందుకు ప్రవేశించినట్లు? ఏమి సాధించినట్లు?

చూడు. బాధించే ప్రపంచము మన చుట్టూ ఉన్నా, మన గుండెలు పగలకుండా పదిలంగా కాపాడే గోవిందుడు మన లోనే ఉన్నాడు. భయపడకు అని చెప్పేవాణ్ణి.

కాని, నల్లనయ్య నన్ను, నా మనసును అలాగే చల్లగా చూశాడు. ఈ నా మాట ఎంత సత్యం అంటే, సూర్యుడు వెలుగుతున్నాడు అన్నంత సత్యం. నీళ్ళు చల్లగా ఉంటాయి అన్నంత సత్యం. అలా జరగకుండా ఉంటే, నేను ఇలా ఉండేవాణ్ణి కాదేమో! నా మనస్సుకు పిచ్చి పట్టేదేమో! అవన్నీ జ్ఞాపక మొచ్చినపుడు పరమేశ్వరుని కృపను తలచుకొని కృతజ్ఞతతో హృదయం ఉక్కిరి బిక్కిరి అవుతుంది. కళ్ళు మంగళస్నానం చేస్తాయి. హర్షాతిరేకంతో శరీరం కంపిస్తుంది. ఆ జ్ఞాపకాలే, ఆ లీలలే ఈ పాటలో తొంగి చూస్తాయి.

పల్లవి :

ఎన్ని విభూతులు? ఎన్నెన్ని మహిమలు?
భక్తులను బ్రోచుటకు భగవంతుని లీలలు! ॥ ఎన్ని ॥

అనుపల్లవి :

సాధుజన రక్షకుని - సంసార తారకుని
అజవందితుని - అద్భుత మహిమలు ॥ ఎన్ని ॥

చరణములు :

1. *అనాదరము చేయదని - పిడికె డటుకులతో*
బాల సఖుని - దర్శింపగ వచ్చిన
బొమికల బాపనుని - అంతరంగము నెరిగి
బొక్కసము నింపిన - భక్తజన వరదుడు ॥ ఎన్ని ॥

2. *అసుర వంశమైనా - జనకుడు దుష్టుడైనా*
హరి ప్రబోధములు - ఔదల దాల్చిన
ఎంత హింసించినా - దైన్యము నొందని
దైత్య ప్రహ్లాదుని - కరుణించిన నరకేసరి ॥ ఎన్ని ॥

3. *నిండు కొలువులో - వలువలు తొలగింప*
విలవిల లాడుతూ - ద్రుపద తనయ
కరములు జోడించి - 'అన్నా' అని పిలువ
వందల వలువ లిచ్చి - రక్షించిన శ్రీపతి ॥ ఎన్ని ॥

4. *కల్మష మెరుగక - కొలిచే చైతన్యుని*
ఎంత హింసించిరో - కలి మానవులు!
కల్లల నోర్చుచు - తల్లడిల్లిన
ఎదను పదిలముగ - నిలిపిన దేవుడు ॥ ఎన్ని ॥

(16) జాగేల రాజీవ నయనా!

నాదొక విలక్షణమైన వ్యక్తిత్వం. ఏదో తొందరపాటులో నా కార్యాలు సాగి పోతున్నట్లు కనిపిస్తాయి. అది నూటికి నూరు శాతం అవాస్తవం. ప్రతి పనిని ఒకటికి రెండు సార్లు ఆలోచించి నేను చేస్తాను. ప్రతి కార్యంలో స్పష్టత, కర్తవ్య నిష్ఠ ఉంటాయి. నా కార్యాలపై నాకు అకుంఠితమైన విశ్వాసం ఉంటుంది.

నేను పరమార్థం వైపు సాగిపోయే బాటసారిని. స్వార్థానికి సంకెళ్ళేశా నేమో గాని, రథ మెక్కించి ఊరేగించ లేదు.

నేను చేసేవి నిస్వార్థమైన కార్యాలు. ఈశ్వరార్పితంగా సాగే కర్మలు. ఈ విధమైన కర్మలలో పాల్గొనే వారు సుకృతాత్ములు అనుకుంటాను. కార్యాలకు సహకరించే వారిని పుణ్యాత్ములుగా భావిస్తాను. వారి సత్కర్మలకు పరమేశ్వరుడు సత్ఫలితాల నిస్తాడని దృఢంగా నమ్ముతాను. నా పుణ్యానికి నేను పని చేస్తున్నా. వారి పుణ్యానికి వారు సహకరిస్తున్నారు అనుకుంటాను. వారు నా కేదో చేసేశారని భావించను. అందుకని, జనాన్ని పొగడటము, ధన సహాయం చేసిన వారిని పల్లకీలో కూర్చోబెట్టి మోయటం నాకు అలవాటు లేదు. ఒక విధంగా చెప్పాలంటే, నాకు అది అయిష్టం కూడా. ఇలా ముక్కుసూటిగా వ్యవహరించడం వల్ల కూడా కష్టాల పాలయ్యాను.

ఆయన మమ్మల్ని సన్మానిస్తే సహాయం చేస్తామనే వాళ్ళు, మమ్మల్ని సభలో గుర్తించ లేదని ఆరాట పడేవాళ్ళు అనేక అడ్డదారులు త్రొక్కి, నన్ను అష్టకష్టాల పాల్జేశారు. కొన్ని సమయాలలో నా మనస్సు తీవ్రంగా కుంచుకు పోయిన క్షణాలు ఉన్నాయి. అలాంటి సందర్భాలలో, ముఖ్యంగా ధవళేశ్వరం ఆశ్రమం కృష్ణాలయంలో కృష్ణుని ఎదుట ఒంటరిగా నిలబడి, కొద్దిగా జగడమే వేసేవాణ్ణి. నా భ్రాంతి కావచ్చు నేమో గాని, స్వామి నా వైపు చూస్తూ నవ్వుతున్నట్లనిపించేది. జగడ మెలా ఉండేది అంటారా? అదే ఈ పాటలో వ్రాశాను.

పల్లవి : *జాగేల రాజీవ నయన*
నిను బాసి క్షణమైన
మనగలనా కరుణాభరణా ॥ జాగేల ॥

అనుపల్లవి :

నీ భక్తుడై యుండి నీ సేవ నాకుండి
అండీ! అండీ! అని పరుల వెంట పరుగిడ గలనా ॥ జాగేల ॥

చరణము :

అడిగి పుచ్చుకొని అటుకుల దింటివి
అడగక అక్షయ సంపద లిస్తివి
అడగవు నన్ను అడుగ నీయవు
అచ్యుతానంత! ఏమిటిదంతా? ॥ జాగేల ॥

(17) రాధను - నీ రాధను

నలిపితే గాని పువ్వు వాసన తెలియదేమో! బాధలలో నలిగితే గాని బ్రతుకు బాగు పడదేమో! అందుకనే, తరచుగా బాధలే బోధలని నేను వేదికలపై చెబుతూ ఉంటాను. సూర్యుడు దేదీప్యమానంగా వెలుగుతున్న ప్రపంచానికే చీకట్లు తప్పడం లేదు. కేవలం మానవులం. బాధలు మనల్ని విడిచి పెడతాయా! కానీ ఒక్కటి మాత్రం సత్యం. బ్రతుకులో మనిషి ఓడి పోవచ్చేమో గాని, భక్తి ఎన్నటికీ ఓడిపోదు. వాడిపోదు.

ఇప్పుడు పరిస్థితి అలాగే ఉంది. అంటే బాధలు లేవని కాదు; బాధల్ని గుర్తించే మనస్సు లేదు. విమర్శలు లేవని కాదు. విమర్శల్ని పరామర్శించే చిత్తము లేదు. పైగా, ఎండమావుల్ని చూస్తూ నవ్వుకొనే మనస్సు సదా తోడుగా ఉంది.

బాల్యం నుండి అనేక దశలలో బ్రతుకు అనేక విధాలుగా మారుతూ కొనసాగింది. నా గమ్యం విషయంలో గాని, గమనం విషయంలో గాని ఏ మార్పు లేదు.

గత నాలుగు దశాబ్దాలుగా చిత్ర విచిత్రంగా జయాప జయాలను చవి చూస్తూ సాగిన జీవితానికి, నేడు స్థిరంగా, ప్రశాంతంగా స్థిరపడిన జీవితానికి ఎంతో తేడా ఉంది. ఉవ్వెత్తున లేచి పడుతున్న కెరటాలకు, నిస్తరంగ జలధికి ఎంత తేడా ఉందో, అంత తేడా స్పష్టంగా తెలుస్తుంది. ఏదో చేయాలనే ఆత్రుత నేడు లేదు. ఏదో చేయలేక పోతున్నా ననే కొరత లేదు. అంతా స్థిరతే. సుస్థిరతే. నాలో ప్రధాన మలుపులుగా తెలుస్తున్న ఈ రెండు దశలను పోల్చుకున్నప్పుడు ఏదో కృతకృత్యత హృదయపు లోతులలో గూడు కట్టుకున్న ట్లనిపిస్తుంది. ఈ తారతమ్యాన్ని ఒక పాటలో నా ఇష్టదైవ మైన కృష్ణునికే విన్నవించుకున్నాను. అదే 'రాధను - నీ రాధను' అనే పాట.

పల్లవి :

రాధను - నీ రాధను
ఆరాధన చేసే రాధను
నీ రాధను - నిరపరాధను ॥ రాధను ॥

చరణములు :

1. *నీ పద కమలాల అలరారుటకు*
ఎదురు చూచిన మొగ్గను - నేడు
యెద విరబూసిన పువ్వును ॥ రాధను ॥

2. *నీ గుడి ముంగిట వెలుగు చిమ్ముటకు*
వేచి యుండిన వత్తిని - నేడు
కాంతి నింపే జ్యోతిని ॥ రాధను ॥

3. *నీ మందిరమున రాగా లొలికే*
పల్లవి కదిలిన పాటను - నేడు
చరణము కదిలే బాటను ॥ రాధను ॥

(18) సుందర చైతన్యాశ్రమం

ఇక ప్రస్తుతం నా కార్యక్రమా లంటారా? శ్రుతిమందిరంలో ప్రతివారం మోక్షధామం తరగతులు దివ్యంగా సాగుతున్నాయి. జిజ్ఞాసువులు అన్నిచోట్ల బాగా పెరిగారు. జ్ఞానాభిలాష చాలా మందిలో స్పష్టంగా గోచరిస్తూ ఉంది.

నేడు నా చుట్టూ ఉన్న వారందరూ నన్నూ, నా జీవితాన్ని చూచిన వాళ్ళు, చదివిన వాళ్ళే కనుక, నిరంతరము ఆశ్రమ బాధ్యతలన్నీ వారి భుజస్కంధాలపై వేసుకొని నన్నొక బిడ్డ లాగా కాపాడుకుంటున్నారు.

సదా రంగవల్లులతో ఆశ్రమాన్ని ముస్తాబు చేస్తూ, తల్లులు సేవా కార్యక్రమాలలో సంతసిస్తున్నారు. చదువుకుంటున్నా, ఉద్యోగాలు నిర్వహిస్తున్నా, తమ ప్రథమ ప్రాధాన్యత ఆశ్రమమే నన్నట్లు 'చైతన్య యువత' యువతీ యువకులు తమ సేవల నందిస్తున్నారు. జ్ఞానయజ్ఞాల కోసం పట్టణాలు ఎర్ర తివాసీలతో ఎదురు చూస్తున్నాయి. అనేక ప్రదేశాల నుండి మరీ పని గట్టుకొని ఆశ్రమాని కొచ్చి, సత్సంగ సభ్యులు సేవ లందిస్తున్నారు. అంతా ఆనందమయం. ఆనంద కృష్ణుని తాండవ నృత్యం. నా కింకేమి కావాలి?

పల్లవి :

సుందర చైతన్యా(శమం
భక్త జనుల కా(శయం
బాధ తీర్చి బోధ పంచే
నిత్య సాధనాలయం ॥ సుందర ॥

చరణములు :

(1) మాటకు పాటకు కోట లాంటి ఆ(శమం
ప్రేమ పువ్వులు నాట్యమాడే తోట లాంటి ఆ(శమం ॥ సుందర ॥

(2) ఉన్నవారు లేనివారు ఒక్కటైన ఆ(శమం
కానివారు తెలిసిరాని కమనీయ ఆ(శమం ॥ సుందర ॥

(3) వేదనాద రవళిని వినిపించు ఆ(శమం
వేదమాత రూపమై కనిపించు ఆ(శమం ॥ సుందర ॥

(4) శ్యామ చరణాలకు సుందర మందిరం
శాంతి కిరణాలకు చైతన్య ఆ(శమం ॥ సుందర ॥

సర్వం శ్రీకృష్ణార్పణ మస్తు!

ఓం. . లోకాస్సమస్తా సుఖినో భవన్తు!

